# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 22-04-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు న్యూఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమయ్యారు.
- ప్రకృతి విపత్తుల కారణంగా ఏ ఒక్క ప్రాణం పోకుండా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు.
- యూపీఎస్సీ సివిల్స్ - 2024 తుది ఫలితాలు ఈరోజు విడుదల అయ్యాయి.
- విద్యుత్ పంపిణీ సంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి నూతన సంస్కరణలు ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందని కేంద్ర సహాయమంత్రి శ్రీపాద యశో నాయక్ పేర్కొన్నారు.
- పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ జూన్ నాటికి పూర్తి చేసి గోదావరి, వంశధారలను అనుసంధానం చేయడం ద్వారా ఉత్తరాంధ్రకు సాగు నీటిని అందిస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.

======================

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీలో పర్యటిస్తున్నారు. ఈరోజు ఉదయం కేంద్ర జల్‌శక్తి శాఖా మంత్రి సీఆర్‌పాటిల్‌తో సమావేశమై పోలవరం, బనకచర్ల ప్రాజెక్టులపై చర్చించారు. అనంతరం కేంద్ర న్యాయ శాఖా మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ ను కలిశారు. మధ్యాహ్నం కేంద్రమంత్రులు అమిత్‌షా, పీయూష్ గోయల్ తో విడి విడిగా సమావేశమయ్యారు. వచ్చే నెల 2వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమరావతి రానున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లపై హోం మంత్రి అమిత్‌షాతో ముఖ్యమంత్రి చర్చించారు. కేంద్ర మంత్రులు కె. రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, పలువురు ఎన్డీయే పార్లమెంట్ సభ్యులు కూడా ముఖ్యమంత్రితో ఈ సమావేశాలలో పాల్గొన్నారు.

======================

ప్రకృతి విపత్తుల కారణంగా ఏ ఒక్క ప్రాణం పోకుండా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని హోం, విపత్తు నిర్వహణల శాఖా మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని విపత్తు నిర్వహణ సంస్థ కార్యాలయంలో వడగాల్పులు, రాబోయే ముందస్తు వర్షాల నేపథ్యంలో సంసిద్ధతపై ఈరోజు మంత్రి సమీక్ష నిర్వహించారు. డ్రైనేజ్, వంతెనలు, ఇరిగేషన్ ప్రాజెక్టుల వంటి వ్యవస్థల పట్ల గత ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరివల్లే రాష్ట్రంలో విపత్తులు సంభవిస్తున్నాయని అన్నారు. రాబోయే రోజుల్లో అత్యధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో వడగాల్పుల పట్ల అవగాహన, అప్రమత్తతకు సంబంధించి అన్ని శాఖల ఉన్నతాధికారులతో ఈ సందర్భంగా చర్చించామని హోం మంత్రి వంగలపూడి అనిత వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

======================

అఖిల భారత సర్వీసుల్లో నియామకాల కోసం యూపీఎస్సీ నిర్వహించిన సివిల్స్ - 2024 తుది ఫలితాలు ఈరోజు విడుదల అయ్యాయి. శక్తి దుబే మొదటి ర్యాంక్ సాధించగా రెండవ ర్యాంక్ హర్షిత గోయల్ మూడవ ర్యాంక్ అర్చిత్ పరాగ్ లు దక్కించుకున్నారు. ఇక తెలుగు రాష్ట్రాల నుంచి సైతం పలువురు విద్యార్థులు ఈరోజు విడుదల చేసిన ఫలితాల జాబితాలో చోటు దక్కించుకున్నారు. ఇ.సాయి శివాని 11వ ర్యాంక్ సాధించగా.. బన్నా వెంకటేశ్ 15, అభిషేక్ శర్మ 38, రావుల జయసింహారెడ్డి 46, శ్రవణ్‌కుమార్ రెడ్డి 62, సాయి చైతన్య జాదవ్ 68, ఎన్ చేతనరెడ్డి 110, చెన్నంరెడ్డి శివగణేష్ రెడ్డి 119, చల్లా పవన్ కల్యాణ్ 146, ఎన్.శ్రీకాంత్ రెడ్డి 151, నెల్లూరు సాయితేజ 154, కొలిపాక శ్రీకృష్ణసాయి 190, బొల్లాం ఉమా మహేశ్వర రెడ్డి 221, చరణ్ తేజ నర్సిం శెట్టి 231, విజయలక్ష్మి 233, ఎస్. సాయికిరణ్ 298, కె. శ్రీనివాస కీర్తి రెడ్డి 316 ర్యాంకులను సాధించారు. సివిల్స్ 2024 ఫలితాల్లో 316వ ర్యాంక్ సాధించన కె.శ్రీనివాస కీర్తి రెడ్డి ఆకాశవాణితో మాట్లాడుతూ...

(వాయిస్ 11 సెకన్లు)

======================

విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కమ్ లు) ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి నూతన సంస్కరణలు ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందని కేంద్ర విద్యుత్ నూతన పునరుత్పాదక ఇంధన శక్తి శాఖ సహాయ మంత్రి శ్రీపాద యశో నాయక్ పేర్కొన్నారు. విద్యుత్ రంగ సంస్కరణలపై గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈరోజు ఆతిథ్యం ఇచ్చింది. విజయవాడ నగరంలో జరిగిన ఈ సమావేశానికి కేంద్ర సహాయమంత్రి శ్రీపాద యశో నాయక్ అధ్యక్షత వహించగా రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ తో పాటూ ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర ఇంధన శాఖా మంత్రులు కూడా హాజరయ్యారు. స్థిరమైన విద్యుత్ పంపిణీ వ్యవస్థను నిర్ధారించడానికి నియంత్రణ సంస్కరణలను ప్రవేశపెట్టడం, నిల్వ పరిష్కారాలు, కృత్రిమ మేధస్సు వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించుకోవాల్సిన అవసరాన్ని కేంద్ర సహాయ మంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఎప్పటికప్పుడు విద్యుత్ టారిఫ్ లను సవరించడం, విద్యుత్ ఎప్పిలేట్ ట్రిబ్యునల్ ను బలోపేతం చేయడం, ఇంధన కొనుగోలు, వ్యయ సర్దుబాట్లను తప్పనిసరిగా అమలు చేయడం లాంటి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

విరామం

======================

విజయనగరం జిల్లాలోని తారకరామ తీర్థసాగర్ రిజర్వాయర్ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. జిల్లాలోని గుర్ల మండలం ఆనందపురం వద్ద నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టు బ్యారేజ్ పనులను ఆయన ఈరోజు పరిశీలించారు. ప్రాజెక్ట్ పురోగతి వివరాలను ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ప్రాజెక్టును పూర్తి చేసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. విజయనగరం పట్టణానికి తాగునీరు, భోగాపురం విమానాశ్రయానికి నీటి అవసరాలను తీర్చడమే కాకుండా, సుమారు 20 వేల ఎకరాలకు పైగా సాగునీరు అందించే తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు నిర్మాణం ఎంతో అవసరమని చెప్పారు. 2014-2019 మధ్య బ్యారేజ్ పనులు 90 శాతం పూర్తయినప్పటికీ, గత ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేసిందని

చెప్పారు. ప్రాజెక్టు డైవర్షన్ కెనాల్ 60 శాతం, సొరంగం పనులు 20 శాతం పూర్తి అయ్యాయని చెప్పారు. మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొంటూ...

(వాయిస్ 36 సెకన్లు)

అనంతరం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జలవనరుల శాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. పోలవరం ప్రాజెక్ట్ ను పూర్తి చేసి గోదావరి నదీ జలాలతో ఉత్తరాంధ్రను సస్యశ్యామలం చేస్తామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ జూన్ నాటికి పూర్తి చేసి గోదావరి నుంచి వంశధార వరకు అనుసంధానం చేయడం ద్వారా ఉత్తరాంధ్రకు సాగు నీరందిస్తామన్నారు. అందుకోసం ఈ సంవత్సరం బడ్జెట్లో 6 వేల 500 కోట్ల రూపాయలను కేటాయించామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.

=======================

రాష్ట్రంలో అధిక ఉష్ణోగ్రతలు, వడగాలులు కొనసాగుతున్నాయి. నిన్న తిరుపతి లో అత్యదికంగా 42.1 సెల్సియస్, అన్నమయ్య జిల్లా కంబాలకుంట, విజయనగరంలో 41.5 సెల్సియస్, నెల్లూరు జిల్లా దగదర్తిలో 41.4 సెల్సియస్ చొప్పున అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. మరోవైపు దిగువ ట్రోపో ఆవరణములో నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయని, వీటి ఫలితంగా రాష్ట్రంలో రేపటి వాతావరణ సూచనలను వాతావరణ అధికారి వెల్లడిస్తూ...

(వాయిస్ 24 సెకన్లు)

=======================
=======================